క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రహర్షిత్‌ను అభినందిస్తున్న రాజ్‌కుమార్

సిరిసిల్లటౌన్: ఇటీవల హుస్నాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సిరిసిల్ల ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ విద్యార్థి దూస ప్రహర్షిత్ అద్వితీయ ప్రతిభ కనబరిచాడు. ప్రహర్షిత్ సిల్వర్ మెడల్ సాధించడంతో పాఠశాల కరెస్పాండెంట్ రాజ్‌కుమార్ అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

సిరిసిల్లటౌన్: గోపా సిరిసిల పట్టణశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వెంకంపేట జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో గోపాల అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ..పదో తరగతి పరీక్షల్లో జీపీఏ సాధించాలన్నారు. కార్యక్రమంలో గోపా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, కోశాధికారి బుర్ర నాగరాజ్‌గౌడ్, మహేశ్ గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామ్మోహన్

తంగళ్లపల్లి: ఎవరైనా గుండెపోటుకు గురైతే సీపీఆర్ ద్వారా కాపాడవచ్చని ఎస్సై రామ్మోహన్ అన్నారు. సోమవారం తంగళ్లపల్లి పీహెచ్‌సీలో నిర్వహించిన సీపీఆర్ అవగాహన సదస్సులో మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురవుతున్నారని తెలిపారు. గుండెపోటు వచ్చిన వారిని సీపీఆర్ ద్వారా బతికించవచ్చని, అనంతరం ఆస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై చంద్రమౌళి, మెడికల్ ఆఫీసర్ స్నేహ, పోలీస్, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

విద్యార్థులకు అవగాహన



గంభీరావుపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే రీసనింగ్ అంశంపై సోమవారం అవగాహన కల్పించారు. పోటీ పరీక్షలకు చదివే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో టాస్క్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ, రిసోర్స్ పర్సన్ నిశాంత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ముస్తాబాద్: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని పోతుగల్ ఏఎంసీ చైర్ పర్సన్ తలారి రాణి అన్నారు. కొండాపూర్, నామాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెస్‌చైర్మన్ వెల్మల రాంరెడ్డి, డైరెక్టర్లు క్యారం రాజు, శంకర్, కార్యదర్శి హరినాథ్, నర్సింలు, రాజు, దేవిరెడ్డి, భాను, దశరథం, విష్ణు, తదితరులున్నారు.

రోడ్డుపై పడుకొని వ్యక్తి హైరానా

బోయినపల్లి: బోయినపల్లి మార్కెట్ యార్డు పరిసరాల్లో రోడ్డుపై పడుకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం రాత్రి హైరానా సృష్టించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కెట్ యార్డు పరిసరాల్లో ఓ వ్యక్తి చలనం లేకుండా పడుకున్నాడని డయల్ 100 కాల్ చేశారు. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ సిబ్బందితో చేరుకొని రోడ్డుపై ఉన్న వ్యక్తిని లేపగా ఎంత తట్టినా లేవలేదు. దీంతో 108కు కాల్‌చేయగా ఆలస్యం కావడంతో పోలీసులు ఆటోలో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీరా ఆస్పత్రికి వెళ్లగానే ఆ వ్యక్తి లేచి కూర్చున్నాడు. దీంతో వైద్యులు, పోలీసులు అవాక్కయ్యారు. ఇలా ఎందుకు చేశావని సదరు వ్యక్తిని అడగగా సమాధానం చెప్పకుండా జారుకున్నట్లు పోలీసులు తెలిపారు.

'డిమాండ్లు పరిష్కరించాలి'

తంగళ్లపల్లి: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కే.లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేయాలని, 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. జీవో నంబర్ 51 సరవరించాలని, జీపీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

ముస్తాబాద్: తెర్లుమద్ది ఎల్లమ్మ ఆలయంలో ×క౯ మూవీ దర్శకులు సందీప్, సుదీప్‌లు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సినిమా విడుదలైన నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు నటుడు తేజ తెలిపారు.

అద్దెకు యంత్రం.. సాగుకు ఊతం



ఎల్లారెడ్డిపేటలో అందుబాటులో ఉన్న అద్దె పనిముట్లు



అద్దెకు సిద్ధంగా ఉంచిన స్ప్రేయర్లు

- అద్దెకు పనిముట్లు..
- మార్కెట్ కంటే తక్కువ రేటు
- రైతులకు ప్రయోజనం
- రూ.35 లక్షలతో ఆధునిక పనిముట్ల కొనుగోలు

ఎల్లారెడ్డిపేట: రైతులపై ఆర్థికభారం పడకుండా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అద్దె పనిముట్లను అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయానికి అవసరమైన పనిముట్లను తక్కువ రేటుకే రైతులకు అద్దెకిస్తూ వ్యవసాయ రంగానికి ఊతమిస్తున్నారు. సన్న, చిన్నకారు వ్యవసాయదారులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ద్వారా రూ.35లక్షలు వెచ్చించి పనిముట్లను కొనుగోలు చేశారు. మండల కావేరి సమాఖ్య ఆధ్వర్యంలో ఐకేపీ భవనం వద్ద కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు పనిముట్లు అద్దెకిస్తున్నారు. ప్రస్తుతం తైవాన్ స్ప్రేయర్లు 10, గడ్డి చుట్టే యంత్రాలు 03, ట్రాక్టర్ 01, రొటవేటర్లు 03, విత్తనాలు, మందులు చల్లే యంత్రాలు 02, కల్టివేటర్ (నాగళ్లు) 03 చొప్పునా అందుబాటులోకి ఉంచారు. రైతులకు అవసరమైన యంత్రాలను గంటలు, రోజుల చొప్పున తక్కువ అద్దెపై ఇస్తూ వ్యవసాయ రంగానికి చేయూతనందిస్తున్నారు.

24 యంత్రాలు రూ.35లక్షలు..

రైతులకు ఉపయోగపడే ఆధునిక వ్యవసాయ యంత్రాలను ముందుగా అందుబాటులోకి తెచ్చారు. రూ.35లక్షలు వెచ్చించి వివిధ రకాల 24 యంత్రాలను కొనుగోలు చేశారు. వరి పండిస్తున్న క్రమంలో ట్రాక్టరు నాగళ్లు కలుపుతీసే యంత్రాలు, పిచికారీ చేసే డబ్బాలు, రొటవేటర్లు, తేమశాతం కొలిచే యంత్రాలు ఇలా అవసరమైన వ్యవసాయ పనిముట్లు తొలుత అద్దె ప్రాతిపాదికన అందిస్తున్నారు. అద్దె పనిముట్లపై ముందుగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు యంత్రాలను అద్దెకిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. రెండెకరాల కన్నా తక్కువగా వ్యవసాయ భూమి ఉండి పట్టాదారు పాసు పుస్తకాలు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ పని ముట్లు అద్దెకు ఇచ్చేందుకు షరతులు విధించారు.

తక్కువ కిరాయికే ..

సన్న, చిన్నకారు రైతులకు తక్కువ కిరాయికే గంటల చొప్పున అద్దె పనిముట్లు ఇస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్ 8 గంటలకు రూ.150, గడ్డి చుట్టే యంత్రం రోజుకు రూ.2,000, రొటవేటర్ రోజుకూ రూ. వెయ్యి, ఎకరానికి మూడు సాల్ల కోసం ట్రాక్టర్ రూ. 6,000, పవర్ టిల్లర్ రూ.1,000, విత్తనాలు, మందులు చల్లే యంత్రాలు 8గంటలకు రూ.1,500, నాగళ్లు రోజుకు రూ.800 చొప్పున ధరలు నిర్ణయించి రైతులకు అందిస్తున్నారు. తక్కువ కిరాయికి అద్దె పనిముట్లు వినియోగించుకొని రైతులు లబ్ధి పొందుతున్నారు.

ఆర్థికభారం తగ్గుతుంది



పంటల దిగుబడి తక్కువ ఉన్న సమయంలో ప్రైవేట్ పనిముట్లను అద్దెకు తీసుకోవడం కష్టంగా ఉంది. తక్కువ అద్దెతో పనిముట్లను అందించడం ఆనందంగా ఉంది. రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది. అన్ని రకాల పనిముట్లు అందుబాటులోకి తేవాలి.

– లద్దునూరి హన్మాండ్లు, రైతు, ఎల్లారెడ్డిపేట

సద్వినియోగం చేసుకోవాలి



వ్యవసాయ రంగానికి ఊతమివ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం అద్దె పనిముట్లు అందుబాటులోకి తెచ్చింది. రైతులు తక్కువ ధరకు ఇచ్చే యంత్రాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలి. రోజూ కేంద్రాన్ని తెరిచి ఉంచుతాం. తగిన ఆధారాలతో రైతులు పనిముట్లను తీసుకోవాలి.

– మల్లేశం, ఐకేపీ ఏపీఎం, ఎల్లారెడ్డిపేట

సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేటలో వయోజన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రస్టు సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లి, అల్మాస్‌పూర్, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలం గూడెం, కొండాపూర్ ఐదు గ్రామాల్లో రాజేశ్ ఫౌండేషన్, విశ్వ ప్రగామి ట్రస్టు ఆధ్వర్యంలో వయోజన విద్యా కేంద్రాలను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుమ్మరి రాజేశ్ సోమవారం ప్రారంభించారు. వయోజనులు చదువుకునేందుకు కావాల్సిన పరికరాలు, బోర్డులు, పలకలు, లైట్స్, ఆరోగ్యానికి సంబంధించిన మొక్కలు పంపిణీ చేశారు. విశ్వగామి ట్రస్టు ప్రతినిధి రాజు, బత్తుల యేసుదాసు, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో

చందుర్తి: మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని మండల విద్యాధికారి వినయ్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని బండపల్లి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ఆనందరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



మాట్లాడుతున్న రూరల్ సీఐ మొగిలి

ఇల్లంతకుంట : గంజాయి, మత్తు పదార్థాలలకు యువత బానిసకావొద్దని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. సోమవారం మండలంలోని రామాజీపేటలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్వే నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అకౌంట్, ఓటీపీ నెంబర్లు అడిగితే చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ గౌడ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



సిరిసిల్ల ఎడ్యుకేషన్: సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ప్రతిభా పోటీల్లో పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. శ్రీ చైతన్య కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్యతోపాటు వసతి కల్పించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1550 విద్యార్థులు పోటీపరీక్షలు రాయగా పాఠశాల నుంచి యాసర వేణి సాయి హర్షిత్, అరుకాల కావ్య, గాజుల నవజీత్ ఎంపికయ్యారన్నారు.

బస్సు ఏర్పాటుపై హర్షం



కోనరావుపేట/రుద్రంగి: కోరుట్ల నుంచి కోనరావుపేట మండలం మరిమడ్ల మీదుగా ఎల్లారెడ్డిపేట వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. మరిమడ్ల నుంచి మానాల, ఎల్లారెడ్డిపేట వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా కోరుట్ల డిపో బస్సు సర్వీసును సోమవారం మర్రిమడ్లలో ప్రారంభించారు. దీంతో జింక శ్రీనివాస్, కోల శ్రీనివాస్, కుమ్మరి రాజ్‌కుమార్, జిన్న శంకరయ్య, జింక నారాయణ, ఆకుల శంకరయ్య తదితరులు ఎమ్మెల్యేకు, డిపో అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటం బహూకరణ



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలను సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగుల ప్రశాంత్‌కుమార్ అందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కల్లెపెల్లి సతీశ్, నాయకులు సాగరం కనుకయ్య, సంపత్‌రావు, ఎండీ.హుస్సేన్, రాజు, సుభాష్, వెంకటేశ్, అజయ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● **టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రమానాథ్‌రెడ్డి**



రమానాథ్‌రెడ్డి, అంజయ్య

సిరిసిల్లటౌన్: టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దుమాల రమానాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విక్రుతి అంజయ్య ఎన్నికయ్యారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్, పరిశీలకులు పాతూరి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా వారు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అశోక్‌కుమార్ ప్రకటించారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా దోర్నాల భూపాల్‌రెడ్డి, సత్తు రవీందర్, సంగెం మాలతి, ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, దేవిరెడ్డి హన్మంతరెడ్డి, దబ్బెడ హన్మాండ్లు, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, నూగూరి దేవేందర్, కేవీ. రజనిరాణి, జిల్లా కార్యదర్శులుగా తాళ్లపల్లి శ్రీధర్, మైలారం తిరుపతి, చకినాల రామచంద్రం, ఎడ్ల కృష్ణచైతన్య, జే. రజనిలు ఏకగ్రీవమయ్యారు.

● **ఎమ్మెల్యే 'ఆది'కి వినతి**

చందుర్తి : సనుగుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేశ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రముఖులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు అదనపు తరగతి గదులతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలన్నారు. ఇక్కడ సనుగుల మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు, గ్రామస్తులు ఉన్నారు.

● **పార్టీ నుంచి తొలగింపు**

తంగళ్లపల్లి: సీపీఎం పార్టీ నుంచి మోర అజయ్ సభ్యత్వాన్ని రద్దుచేసి పార్టీలోంచి తొలగించినట్లు సీపీఎం మండల కార్యదర్శి కోడం రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా, పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో తొలగించినట్లు పేర్కొన్నారు.

● **జాతీయ విద్యా దినోత్సవం**

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హెచ్ బండి ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **ఆలయంలో పూజలు**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భగవధారణ, దివ్య ప్రభంద, సేవాకాలం, నివేదన, తీర్థప్రసాద వితరణ, తదితర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, వేద పండితులు నవీన్‌చారి, గోపాల్‌చారి పాల్గొన్నారు.

● **పార్టీ కార్యాలయం ప్రారంభం**

వేములవాడఅర్బన్: పార్టీ కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మహాంకాళి చౌరస్తా వద్ద 21 వార్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులున్నారు.

● **విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు**

కోనరావుపేట: గొల్లపల్లి(వట్టిమల్ల)లో సెస్ సిబ్బంది విద్యుత్ బిల్లుల రీడింగ్ నమోదు చేస్తుండగా కమ్మరిపేటతండాకు చెందిన ఇస్లావత్ రమేశ్ సిబ్బంది చేతిలోని బిల్లింగ్ మిషన్ లాక్కుని పగులగొట్టాడు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లింది. అసిస్టెంట్ హెల్పర్ దాసరి సురేశ్ ఇచ్చిన ఫి ర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

● **బదిలీ ఉత్తర్వులు జారీచేయాలి**

వేములవాడఅర్బన్: 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు జారీచేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ అన్నారు. వేములవాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. 317 బాధిత ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని, వారందరికీ న్యాయం చేస్తామని సీఎం ప్రకటించి 15 రోజులైనా ఉత్తర్వులు రాకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీచేయాలని కోరారు.

● **రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు**

సిరిసిల్ల అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. సారంపల్లికి చెందిన మంగళపల్లి నరేశ్ (35) బైక్‌పై సిరిసిల్ల వైపు నుంచి సారంపల్లికి వెళ్తుండగా కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో మరో బైకును ఢీకొట్టాడు. దీంతో నరేశ్‌కు తీవ్ర గాయాలుకాగా స్థానికులు చికిత్స నిమిత్తం 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. .

● **చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి**

గంభీరావుపేట: సముద్రలింగాపూర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి గాయపడి సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొట్టినట్లు తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

● **హుండీ చోరీ**

ముస్తాబాద్: మద్దికుంటలో పురాతన శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ అర్చకులు సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లగా, హుండీ కనిపించలేదు. ఆలయ మండపంలో ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు



ముస్తాబాద్: ముస్తాబాద్, కామారెడ్డి ప్రధాన రహదారిపై నామాపూర్‌లోని ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. చెత్త కుప్పలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారైంది. అపరిశుభ్ర వాతావరణంలో ప్రయాణ ప్రాంగణం ఉండడంతో అటుగా ఎవరూ వెళ్లడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్ వినియోగంలో తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రాజు, పంచాయతీ కార్యదర్శి, నామాపూర్, సెల్‌నెంబర్ 9866891154

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

సర్వేతో బీసీల సంక్షేమానికి పెద్దపీట



ముస్తాబాద్ : ముస్తాబాద్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది



ఎల్లారెడ్డిపేటలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్ గౌతమి

ముస్తాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్థిక, సామాజిక సర్వేతో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు ఎన్ఆర్ఐ కాంగ్రెస్‌సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ అన్నారు. సోమవారం మండలంలోని పోతుగల్‌లో సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ధర్మేందర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వే దోహదపడుతుందన్నారు. ఇంటింటా చేపట్టిన సర్వేలో ప్రజలు సహకరించాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సూపర్‌వైజర్ ఎల్లారెడ్డి, నాయకులు తలారి నర్సింలు, రాజు, అంజనేయులు, శ్రీనివాస్, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం సమగ్ర ఇంటింటి సర్వే కొనసాగింది. సర్వేలో భాగంగా పలు ప్రశ్నలు అడిగి కుటుంబ సభ్యుల వివరాలు రాబడుతున్నారు. స్థిరాస్తుల వివరాలు, వివిధ రకాల వాహనాలు, ప్లాట్స్, వ్యవసాయ భూముల వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ.. సమగ్ర సర్వేకు ప్రజలు అన్ని విధాలా సహకరించాలన్నారు. ఎంపీవో జోగం రాజు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులుపాల్గొన్నారు.

మూడు రోజులు సెలూన్ షాపులు బంద్



బంద్ పోస్టర్‌ను అతికిస్తున్న నాయీ బ్రాహ్మణులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో మూడు రోజులపాటు సెలూన్ షాపులు మూసివేస్తున్నట్లు నాయీబ్రాహ్మణ కులస్తులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వేరే కులానికి చెందిన వ్యక్తి కార్పొరేట్ స్థాయిలో సెలూన్ షాపును నెలకొల్పడాన్ని నిరసిస్తూ మూడురోజుల పాటు నిరసన తెలపనున్నట్లు చెప్పారు. నిరసనలో జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గడ్డం నవీన్, ఉపాధ్యక్షుడు సారంపల్లి సంతోష్, ఇన్నారం రమేశ్, గంగిపల్లి చిరంజీవి, అమృత, అనిల్, శ్రీకాంత్, భూమేశ్, గడ్డం తిరుపతి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అధికారులు కక్షసాధింపు మానుకోవాలి

- సిరిసిల్లలో భవన నిర్మాణంలో వివాదం
- అనుమతి లేని నిర్మాణాన్ని కూల్చాలన్న అధికారులు
- మున్సిపల్ అధికారులతో భవన యజమాని వాగ్వాదం..



భవనంపై కూర్చొని నిరసన తెలుపుతున్న శివ

సిరిసిల్లటౌన్: మా భవనంలో నిర్మాణాన్ని కూల్చేస్తే.. దూకేస్తా అంటూ ఓ వ్యాపారి సోమవారం హల్‌చల్ చేశాడు. మున్సిపల్ అధికారులు తమ స్థలం నుంచి కచ్చాకాల్వను తీస్తామంటే ఒప్పుకోనందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులను అడ్డగించడం పట్టణంలో చర్చనీయాంశమైంది. బిల్డింగ్ యజమాని పుల్లూరి సురేశ్ వివరాల ప్రకారం.. పట్టణంలోని పెద్ద బజార్ ప్రాంతంలో మూడేళ్ల క్రితమే కొత్తగా నిర్మించిన జీ ప్లస్ టూ పర్మిషన్ ఉన్న బిల్డింగ్‌ను కొన్నట్లు తెలిపాడు. అయితే మూడో అంతస్తు కూడా పర్మిషన్ తీసుకుని నిర్మించుకున్నామని తెలిపాడు. సిరిసిల్ల కొత్తచెరువు శివారులోని తమ స్థలంనుంచి కచ్చాకాల్వను తీయడానికి మున్సిపల్ చర్యలు తీసుకోగా అడ్డుకున్నట్లు చెప్పాడు. దీంతో బల్దియా తమ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ఈక్రమంలోనే తన బిల్డింగ్‌కు పర్మిషన్ ఉన్నా..కొంతమేర అనుమతి లేకుండా నిర్మించారని సదరు నిర్మాణాన్ని కూల్చేస్తామని వచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణంలో వందల సంఖ్యలో అక్రమ కట్టడాలున్నా తమపైనే కుట్రపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగిన సురేశ్ కుమారుడు శివ బిల్డింగ్‌పైకి అధికారులు ఎవరూ రావొద్దని వస్తే..దూకేస్తామంటూ బైఠాయించడంతో అధికారులు వెనక్కి వెళ్లారు.

కోర్టు ఆదేశాలు మేరకే..

బిల్డింగ్ యజమాని స్టిల్ట్ టూ త్రీ ఫ్లోర్‌కు అనుమతి పొంది ఉన్నారని టీపీవో సాయికృష్ణ తెలిపారు. స్టిల్ట్‌లో పార్కింగ్ ఏర్పాటు చేయలేదని, బిల్డింగ్ నిర్మాణంలో తూర్పున 1మీటర్, పడమర 0.38మీటర్, ఉత్తరం 1.52 మీటర్లు, దక్షిణం 0.29మీటర్లు ఎక్కువకు స్లాబ్ వేశారన్నారు. దానికి మార్కింగ్ చేశామన్నారు. ఈ విషయంలో కోర్టును బిల్డింగ్ యజమానే ఆశ్రయించారని, కోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు టీపీవో వివరించారు. ఉన్నతాధికారులకు విషయం తెలిపి చర్యలు తీసుకుంటామన్నారు.